క్లుప్తంగా

ఉపాధి కూలీ చేతికి గాయం



మల్హర్: జాతీయ గ్రామీణా ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలంలోని ఎడ్లపల్లి గ్రామంలోని ఉర చెరువులో మంగళవారం ఉపాధి పనులు చేస్తున్న విజయగిరి జయ అనే ఉపాధి కూలీకి గాయమైంది. చెరువు పనులు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు జయ చేతికి గునపం దిగడం వలన తీవ్రంగా గాయపడింది. గమనించిన ఏపీఓ హరీష్, సిబ్బంది ప్రథమ చికిత్స అనంతరం ఆమెను భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం తెలుకున్న డీఆర్‌డీఓ పల్లికొండ నరేష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి



ఎస్ఎస్‌తాడ్వాయి: గుర్తు తెలియాని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన పస్రా–తాడ్వాయి మధ్యలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం వెంకటపూరం(కె) మండలంలోని పాత్రపూరం గ్రామానికి చెందిన కొండపర్తి జ్యోతికిరణ్, అదే మండలంలోని బీసీమర్రిగూడెం చెందిన కొప్పుల వెంకటేష్, వాజేడు మండలంలోని ప్రగళ్లపల్లికి చెందిన పాయం రక్షిత్ ద్విచక్రవాహనంపై ములుగు జిల్లా కేంద్రంలో ఓపెన్ ఇంటర్ పరీక్ష రాయాడానికి వచ్చారు. పరీక్ష రాసిన అనంతరం తిరుగు ప్రయాణంలో పస్రా మార్గంలోని ఫారెస్టు చెక్ పోస్టు దాటిన తర్వాత గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో జ్యోతికిరణ్(19) వెంకటేశ్(18) అక్కడిక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన పాయం రక్షిత్‌ను చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



ములుగు: గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా టీబీ, లెప్రసీ నియంత్రణాధికారి డాక్టర్ పోరిక రవీందర్ సూచించారు. ములుగు మండలం మదనపల్లి సబ్‌సెంటర్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీబీ పేషెంట్‌తో మాట్లాడి మందులు వాడాలని సూచించారు. గర్భిణులకు సొంత ఖర్చులతో పౌష్టికాహారం అందించారు. ఆయన వెంట ఏఎన్ఎం కల్పన, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



మంగపేట: కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్టీసెల్ అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య సమక్షంలో బీఆర్ఎస్ నుంచి పలువురు కార్యకర్తలు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో తూడి భగవాన్‌రెడ్డి, పెద్ది నర్సింహులు, కారుపోతుల నర్సయ్య గౌడ్, సత్యనారాయణ, జగదీశ్వర రావు, గౌతమ్ కుమార్, సురేష్, సాంబ రెడ్డి, రాంబాబు, వెంకటేశ్వర్లు, శశికుమార్ ఉన్నారు.

ఉచిత శిక్షణ

ఏటూరునాగారం: జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి తుల రవి ఆధ్వర్యంలో ఏటూరునాగారం మండలంలోని క్రీడా ప్రాంగణంలో హ్యాండ్ బాల్ క్రీడపై ఉచిత వేసవి క్రీడల క్యాంపు నేటి నుంచి ఈనెల 31 వరకు నిర్వహించనున్నట్లు హ్యాండ్ బాల్ కోచ్ పర్వతాల కుమారస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు జిల్లా యువజన, క్రీడల అధికారి చేతుల మీదుగా శిక్షణ సర్టిఫికెట్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. 15 సంవత్సరాల బాలబాలికలకు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి

ఏటూరునాగారం: బీజేపీతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గాడిచర్ల రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మహబూబాబాద్ ఎంపీ బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్ గెలిపించాలని ప్రచారాన్ని చేపట్టారు. రాబోయే కాలంలో దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి అంటే కేంద్రంలో నరేంద్రమోదీ పాలన ఉండాలన్నారు. కార్యక్రమంలో పల్లా బుచ్చయ్య, చక్రవర్తి, సత్యం, జాడి రామరాజు, జనార్దన్, గంగా, రాకేష్, రమేష్, అటిక నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

‘పది’ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



అక్షిత(9.8)



నక్షత్ర (9.5)



సాయిలోహిత(9.5)



మీనా వైష్ణవి (9.5)



అఖిల్ (10)



మధురిమ(10)



ప్రవళిక (9.3)

చిట్యాల: పది పరీక్షలలో మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ పాఠశాలలో 40 మంది విద్యార్థులకు గాను 40 మంది విద్యార్థినులు ఉత్తీర్ణులయ్యారు. పాఠశాలకు చెందిన కొత్తూరి అంజన పదవ తరగతి పరీక్షల్లో 10 జీపీఏ సాధించినట్లు ఎంఈఓ రఘుపతి తెలిపారు. అలాగే సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 74 కు 74 మంది, మోడల్ స్కూల్‌లో 59 గాను 56 మంది, చిట్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 31 గాను 29 మంది, చల్లగరిగ ప్రభుత్వ పాఠశాలలో 30 మందికి 29 మంది, జూకల్ ప్రభుత్వపాఠశాలలో 20 మందికి 19 మంది, జడల్‌పేట ప్రభుత్వ పాఠశాలలో 11 మందికి 10 మంది, నైన్‌పాక ప్రభుత్వ పాఠశాలలో 34 మందికి గాను 34 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఏంఈఓ తెలిపారు.

మహాముత్తారంలో..

మహాముత్తారం: మండలంలోని మోడల్‌పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి మండలంలో మొదటి స్థానంలో నిలిచారు. మోడల్‌పాఠశాలకు చెందిన తాటి సాయిలోహిత, మీనా వైష్ణవిలు 9.5 జీపీలు పొందగా ఊరుగొండ శ్రీవిద్య, జాడి మానసలు 9.3 పొందారు. వీరవేణిశ్రీనిధి, మార్క దేవెందర్‌లు 9.2పొందారు. వీరిని మోడల్ పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

కాళేశ్వరం హైస్కూలో తగ్గిన ఉత్తీర్ణత

కాళేశ్వరం: కాళేశ్వరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఉత్తీర్ణత శాతం తగ్గింది. మంగళవారం వెల్లడించిన పదవతరగతి ఫలితాల్లో కాళేశ్వరం పాఠశాలలో 33మంది విద్యార్థులకు 16మంది ఉత్తీర్ణత సాధించారు. 16మంది విద్యార్థులు ఫేయిల్ అయ్యారు. ఒక్కరు పరీక్షకు హాజరు కాలేదు. ఇందులో సుబ్బలక్ష్మీపాండా, రేష్మాలకు 8.0 జీపీఏ గ్రేడు మార్కులతో టాపర్లుగా నిలిచారు. కాళేశ్వరంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో 18మంది విద్యార్థులకు గాను 14 మంది ఉత్తీర్ణత సాధించారు. 8.2జీపీఏ గ్రేడు మార్కులతో మడిశెట్టి శివాణి, గుర్రం సాత్వీక, ఆకుదారి రుష్మితలు పాఠశాల టాపర్లుగా నిలిచారని ఉపాధ్యాయులు తెలిపారు.

మల్హర్: పదోవ తరగతి ఫలితాల్లో మండల వ్యాప్తంగా 98.25 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో, మల్లారం జిల్లా పరిషత్ పాఠశాలో, ఎడ్లపల్లి మోడల్‌స్కూల్‌లో, వల్లెకుంట జిల్లా పరిషత్‌లో, పెద్దతూండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో, మల్లారాం కేజీబీవీలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. రుద్రారం జిల్లా పరిషత్ 57.14 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థిని తాండ్ర నక్షత్ర 9.5 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

మండల టాపర్ ప్రవళిక

టేకుమట్ల: పది పరీక్షల ఫలితాల్లో కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయానికి చెందిన పిల్లి ప్రవళిక 9.3 జీపీఏతో మండల టాపర్‌గా నిలిచినట్లు మండల విద్యాధికారి కోడెపాక రఘుపతి తెలిపారు. మండల కేంద్రంతో పాటు, మండలంలోని వెంకట్రావుపల్లి, గర్మిళ్ళపల్లి, వెలిశాల, రాఘవరెడ్డిపేట, కుందనపల్లి, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయానికి చెందిన 148 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 129 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

మాంటిస్సోరి విద్యార్థుల విజయదుందుభి

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని మాంటిస్సోరి ఉన్నత పాఠశాల విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో విజయదుందుభి మోగించినట్లు పాఠశాల అధ్యక్షుడు గండ్ర సుధాకర్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో 174 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరుకాగా 22 మంది విద్యార్థులు 10 జీపీఏ పాయింట్లు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో అత్యధిక జీపీఏ పాయింట్లు సాధించిన విద్యార్థులను వైస్ చైర్మన్ సీస్ జోస్, ఫైనాన్స్ డైరెక్టర్ నూకల శ్రీనివాసరావులు అభినందించారు.

పది ఫలితాల్లో ప్రైవేట్ విద్యార్థుల సత్తా..

కాటారం: పదవ తరగతి ఫలితాల్లో మండలంలోని ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన ఏ.అఖిల్ అనే విద్యార్థి 10 జీపీఏ, మాంటిస్సోరి పాఠశాలకు చెందిన బుడిగె మధురిమ, తిపిరి రశ్మిత, జనగామ జస్వంత్, సామ ఓంసాయి, గాదె మనోజ్‌కుమార్ 10 జీపీఏ సాధించి మండల టాపర్లుగా నిలిచారు. ప్రైవేటు పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత నెలకొంది. కాగా ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి ఫలితాలు కొంత మేర నిరాశ పర్చాయి. ఒకటి రెండు పాఠశాల విద్యార్థులు మినహా అన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 9 జీపీఏ లోపే పరిమితమయ్యారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం అంతంత మాత్రంగానే నెలకొంది. గిరిజన గురుకుల సంక్షేమ బాలికల పాఠశాలకు చెందిన శిరీష, రక్షిత 9.8 జీపీఏ, దామెరకుంట సాంఘీక సంక్షేమ బాలికల పాఠశాలకు చెందిన శరణ్య, సృజన 9.8 జీపీఏ సాధించి ప్రభుత్వ పాఠశాలల విభాగంలో జిల్లా స్థాయిలో నిలిచారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆదర్శ పాఠశాల చైర్మన్ జనగామ కరుణాకర్‌రావు, కరస్పాండెంట్ జనగామ కార్తీక్‌రావు, మాంటిస్సోరి పాఠశాల డైరెక్టర్ కామిడి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

కమిటీ ఎన్నిక



కమిటీ ఎన్నికలో పాల్గొన్న నాయకులు

గోవిందరావుపేట: మండల పరిధిలోని పస్రా గ్రామంలో ఎంపీపీ సూడి శ్రీనివాస్ రెడ్డి ఇంటి వద్ద మంగళవారం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లకావత్ నరసింహ నాయక్ ఆధ్వర్యంలో గోవిందరావుపేట బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ సమన్వయ కమిటీని ఎన్నుకున్నారు. సమన్వయ కమిటీ సభ్యులుగా ఎంపీపీ సూడి శ్రీనివాస్ రెడ్డి, జెడ్పీటీసీ తుమ్మల హరిబాబు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లకావత్ నరసింహ నాయక్, మధుసూదన్‌రెడ్డి, బుర్ర సురేందర్, స్వప్న లక్ష్మారెడ్డి, ఆలూరి శ్రీనివాస్‌రావు, రామచందర్, స్వరూప, చందులాల్, దేవా నాయక్, ఈసం సమ్మయ్య, నర్సిరెడ్డి, శ్రీనివాస్ రావు, తలసీల ప్రసాద్, మల్లేష్, సురేష్, ఫక్రుద్దీన్, ఐలోని, బొల్లం ప్రసాద్, బూరెడ్డి మధు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నరసింహనాయక్ మట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ మహబుబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాలోత్ కవితకు మండలం నుంచి భారీ మెజార్టీ వచ్చేలా కష్టపడి పని చేయాలన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు(బుధవారం) మహబూబాబాద్‌కు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వస్తున్న సభకు మండలం నుంచి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మామిడి తోట దగ్ధం



బాధితుడితో మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారి

చిట్యాల: మండలంలోని తిర్మలాపూర్ గ్రామ పంచాయతీ రాంచంద్రాపూర్ గ్రామ శివారులో అదే గ్రామానికి చెందిన క్యాతం రాజయ్యకు సంబంధించిన మూడు ఎకరాల మామిడి తోట నిప్పు అంటుకుని దగ్ధం అయినట్లు బాధితుడు తెలిపారు. అయన తెలిపిన వివరాల ప్రకారం.. గత పదేళ్ల క్రితం రాంచంద్రాపూర్ శివారులో రోడ్డు వెంట మూడు ఎకరాలలో 435 మామిడి మొక్కలను నాటినట్లు తెలిపారు. ఈ మేరకు మామిడి కాయలను బుధవారం కోసేందుకు సిద్ధం చేసుకోగా గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి మామిడి తోటకు నిప్పు అంటించినట్లు పేర్కొన్నారు. మామిడికాయాలు సుమారు పది టన్నుల వృథాగా కాలిపోయాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. అలాగే మూడు ఎకరాలయ్యే నాటిన మామిడి మొక్కలకు నీటి కోసం ఏర్పాటు చేసిన 40 లేన్స్ పైపులు, డ్రిప్స్ పైపులు, మోటర్లు, వైర్లు, పూర్తిగా కాలిపోయాయని పేర్కొన్నారు. సుమారు రూ.మూడు లక్షల వరకు అస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరాడు.

మామిడి తోటను పరిశీలించిన ఉద్యాన శాఖ అధికారి

దగ్ధమైన మామిడి తోటను భూపాలపల్లి డివిజన్ ఉద్యానశాఖ అధికారి ఏ.సునీల్ కుమార్ పేర్కొన్నారు. మామిడి తోట కాలిపోవడానికి గల కారణాలను తెలుసుకుని ప్రాథమికంగా విచారణ చేపట్టి జరిగిన నష్టాన్ని అంచన వేస్తామన్నారు. ప్రస్తతం కాయలను కోసేందుకు సిద్ధంగా ఉన్న రైతుకు ఎక్కువ నష్టం వాటిల్లినట్లు, దినికి సంబందించిన నష్టాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకపోయి బాధితుడికి న్యాయం చేస్తామన్నారు. కాగా కాలిన మొక్కలకు సత్వరమే నీటి తడులు అందించాలని రైతుకు తెలిపారు.

నిప్పుల కొలిమి



నిర్మానుష్యంగా ఉన్న టేకుమట్ల చౌరస్తా

టేకుమట్ల: భానుడి భగభగతో ఎండ నిప్పుల కొలిమిలి తలపిస్తుంది. కొన్ని రోజులుగా 45డిగ్రీల సెల్సియస్ పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఇంటి నుంచి బయటికి రావడం లేదు. నిత్యం జనాలతో కళకళలాడే మండల కేంద్రం జనాలు లేక వెలవెలబోతోంది. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎండ వేడి తగ్గకపోవడంతో జనాలు ఎవరూ రోడ్డు పైకి రావడం లేదు. మండల కేంద్రానికి జనాలు రాకపోవడంతో చిరువ్యారులు, వ్యాపారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పండ్లు, కూరగాయల వ్యాపారుల పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఎండ వేడిమికి పండ్లు, కూరగాయలు వాడిపోతున్నాయని, జనాలు లేక గిరాకీ కావడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంట్లో సైతం వేడి ఉక్కపోతకు తట్టుకోలేక ప్రతీ ఇంట్లో కూలర్లు నిరంతరం తిరుగుతూనే ఉన్నాయి. దాంతో కూలర్ల వ్యాపారస్తులు కూలర్ల ధరను కొండెక్కిస్తున్నారు. ఒక్కో కూలర్ ధర సుమారు రూ.4000లకు పైమాటే అంటున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



“ఎండల తీవ్రత రోజు రోజుకు పెరుగుతుండడంతో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి. కూలీలు ఎండ తీవ్రత పెరగకముందే ఇంటికి చేరుకోవాలి. వడదెబ్బతో శరీరంలోని నీటి శాతం పడిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవల్సి ఉంటుంది కావున ఎండ నుంచి ఇంటికి రాగానే ఓఆర్ఎస్ కలిపిన ద్రావణాన్ని తీసుకోవాలి. వడదెబ్బ తగిలితే ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ ఆశాజ్యోతి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెలిశాల

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

టేకుమట్ల: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు, మండలంలోని బూర్నపల్లి, వెంకట్రావుపల్లి, ద్వారకపేట గ్రామాల్లో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేసి వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి మారపల్లి సుదీర్‌కుమార్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అసత్యపు హామీలను ప్రజలకు వివరిస్తూ బీఆర్ఎస్ పాలనలోని సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని సూచించారు. అనంతరం బూర్నపల్లి, జోడుపల్లి, ద్వార కపేట గ్రామాలలో ఇటీవల మృతి చెందిన కొండ రమేష్, ఆరుట్ల కొమురమ్మ, కావటి లక్ష్మీ కుటుంబ సభ్యులను పరామర్శించి, తన గ్రాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ రెడి మల్లారెడ్డి, వైస్ ఎంపీపీ పోతనవేని ఐలయ్య, నేరేళ్ల రామకృష్ణగౌడ్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు మహేష్‌యాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డి, ఆది రఘు, ఆకునూరి తిరుపతి, నేరేళ్ల శ్రీనివాస్, దొడ్ల కోటి, బందెల నరేష్, జెట్టి మధునయ్య, నిమ్మల స్వామి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



ఎస్ఎస్ తాడ్వాయి: బెల్లంపానకం డ్రమ్ములను స్వాధీనం చేసుకున్న అధికారులు



ఏటూరునాగారం: అరెస్టు చేసి చూపిస్తున్న ఎక్సైజ్‌శాఖ పోలీసులు

ఎస్ఎస్‌తాడ్వాయి/గోవిందరావుపేట: ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్, ములుగు, ఏటూరునాగారం ఎక్సైజ్‌శాఖ స్టేషన్ అధికారులు, సిబ్బంది సంయుక్తంగా మంగళవారం మండలంలోని నార్లాపూర్, బయ్యక్క, గోవిందరావుపేట మండలంలోని దుంపెల్లిగూడెం, రాంనాగర్, పాపయ్యపల్లి బలాజీనాగర్ గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 20 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని, 2200 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేయడంతో పాటు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రోహిబిషన్, ఎక్సైజ్‌శాఖ వరంగల్ నాగేంద్ర అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా గుడుంబా, అక్రమ మద్యం, ఇతర మత్తు పదార్థాలపై నిఘాపెంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోహిబిషన్, ఎక్సైజ్‌శాఖ అధికారి శ్రీనివాస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరిండెంటెండ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్‌శాఖ సీఐలు సుధీర్‌కుమార్, రామకృష్ణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ నాగేశ్వర్‌రావు, డీటీఎఫ్ సీఐ రాజసమ్మయ్య, ములుగు ఎక్సైజ్‌శాఖ ఎస్సై లింగయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై శిరీష, సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

ఏటూరునాగారం: ద్విచక్రవాహనంపై 20లీటర్ల గుడుంబాను తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రామకృష్ణ తెలిపారు. మంగళవారం వాజేడు మండలం టేకులగూడెం వద్ద పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. వెంకటాపురం(కె) మహితాపురం అట్టం రాంబాబు గుడుంబా తరలిస్తుండగా పట్టుకుని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నవీన్, తిరుపతి, శ్రీనివాస్, ప్రణయ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మంత్రి సీతక్క

ములుగు రూరల్: కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల పరిధిలోని బరిగలానిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి సీతక్క పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బడా వ్యాపారులకు కొమ్ముకాసే బీజేపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. పేదల కోసం కొట్లాడే రాహుల్‌గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. కాంగ్రెస్ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ను ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాయిత మొగిలి, రాజు, రానబోయిన నారాయణస్వామి, మాజీ సర్పంచ్‌లు కాయిత రాజయ్య, వైనాల రమేష్, పులి భద్రయ్య, చిలుక సురేష్‌లతో పాటు 50 మంది పార్టీలో చేరారు.

ఎంపీ అభ్యర్థి పాదయాత్ర

భూపాలపల్లి అర్బన్: జై మహభారత్‌పార్టీ వరంగల్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి ఎస్‌పీకే సాగర్ మంగళవారం మండలంలోని నందిగామ శివారు పందిపంపుల నుంచి పాదయాత్ర ప్రారంభించారు. గడపగడపకు వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నానని, గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుకుంటున్నట్లు ఆయన తెలిపారు. పోడు భూములు, ఇళ్ల స్థలాలకు పట్టాలు, నిరుద్యోగ సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

బలరాంనాయక్‌ను గెలిపించాలి



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావ్, మాజీ ఎమ్మెల్యే వీరయ్య



ఎస్ఎస్ తాడ్వాయి: మాట్లాడుతున్న దేవేందర్

వెంకటాపురం(కె)/వాజేడు: వెంకటాపురం(కె), వాజేడు మండలాల్లో మంగళవారం కాంగ్రెస్ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బలరాం నాయక్ విజయాన్ని కాంక్షిస్తూ భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ గ్యారంటీ కార్డును ఓటర్లకు చూపిస్తూ బలరాం నాయక్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. వెంకటాపురం(కె)లో నాయకులు నల్లపు దుర్గ ప్రసాద్, జెడ్పీటీసీ పాయం రమణ, సొసైటీ అధ్యక్షుడు చిడెం మోహనరావు, వైస్ ఎంపీపీ సయ్యద్ హుస్సేన్, ఎంపీటీసీ గార్లపాటి రవి, నాయకులు చిడెం శివ, మన్యం సునీల్, వాజేడులో నియోజకవర్గ కోఆర్డినేటర్ నల్లపు దుర్గాప్రసాద్, సున్న రామ కృష్ణ, చింతిర్యాల రవికుమార్, ఎస్‌కే రసూల్, యశోద రాంబాబు, నర్సింహరావు, మండల అధ్యక్షుడు డెనార్జున్ రావు, రాంబాబు, సర్వేశ్వరరావు, సాంబశివరావు, వరుణ్, శేషు ఉన్నారు.

ఎస్ఎస్‌తాడ్వాయి: హస్తం గుర్తుకు ఓటేసి ఎంపీగా పోరిక బలరాంనాయక్‌ను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ కోరారు. బలరాంనాయక్ గెలుపు కోసం మండల కేంద్రంలో తాడ్వాయి, ఇందిరానగర్ గ్రామాల్లో పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు నాయకులు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా బొల్లు దేవేందర్ మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టింది కాంగ్రెస్ పార్టీనేనని కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉపాధి కూలీలకు రోజుకు రూ.400 అమలు చేస్తుందన్నారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రేగ కల్యాణి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాక సాంబయ్య, మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్ దొర, పీఏసీఎస్ యానాల సిద్ధిరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, నాయకులు సాదు చక్రపాణి, రాజిరెడ్డి, మధు పాల్గొన్నారు.

గోవిందరావుపేట: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ మండల కేంద్రంలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ అధ్యక్షతన క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు కణతల నాగేందర్, జెట్టి సోమయ్య, బూత్ ఇన్‌చార్జ్ జంపాల చంద్రశేకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బలరాం నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఆగస్టు 15లోపు రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లావుడ్య లక్ష్మి, జోగ నాయక్, మద్దాలి నాగమణి, ఈర్ల పాపులు, దయానందం, రాజు, రామారావు, నాగమణి, వెంకటేశ్వరరావు, రాము, శివ, బాబు పాల్గొన్నారు.

ఉద్యోగికి పదవీ విరమణ సహజం



సకినను సన్మానిస్తున్న నాయకులు

ములుగు రూరల్: ఉద్యోగికి పదవీ విరమణ సహజమని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శిరుప సతీష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలికల పాఠశాలలో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన సకినను ఎస్టీయూ సంఘం ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సకిన 30 సంవత్సరాల సర్వీస్‌లో ములుగు బాలికల పాఠశాలలో ఉపాధ్యాయులకు, అధికారులకు ఉత్తమ సేవలు అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ల మధుసూదన్, జయదేవ్, ప్రభాకర్, శాంసన్, కసన్‌సింగ్, హమీద్, జగధీష్, మమత, వసంత, విద్యాసాగర్ పాల్గొన్నారు.